క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



లక్ష్మీపురం: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందని తెలుగు పండిట్ రాజన్న మాస్టారు పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఓటరు చైతన్య సభ మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు పవిత్రమైనదని, పరిపాలన విధానానికి ఆయుధం లాంటిదన్నారు. విశ్రాంత జంతుశాస్త్ర శాఖాధిపతి డాక్టర్ ఆర్.రామచంద్రరావు, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడుతూ చాలామంది ఓటును కేవలం ఎన్నికల ప్రక్రియగా, రాజకీయ తంతుగా భావిస్తున్నారని అది సరికాదని చెప్పారు. స్వార్థ రాజకీయాల కోసం కోట్ల రూపాయలు వెదజల్లే వారిని ప్రజాప్రతినిధులు కాకుండా అడ్డుకోవటానికి ఓటే శక్తివంతమైన ఆయుధమని చెప్పారు. కార్యక్రమంలో రవి మెడికల్స్ శివశంకరరావు, సంస్థ సీనియర్ సభ్యులు ఎస్.విద్యాధర కుమార్, సి.హెచ్.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడారు.

ఇండియా కూటమి అభ్యర్థికి కార్మికుల మద్దతు

లక్ష్మీపురం: ఇండియా కూటమి బలపరిచిన గుంటూరు పార్లమెంట్ సీపీఐ ఎంపీ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్‌ను మద్దతుగా కార్మికులు మంగళవారం సమావేశం నిర్వహించారు. స్థానిక రేగుల రాఘవయ్య భవన్‌లో నగర ముఠా కార్మిక సంఘం ఏఐటీయూసీ నాయకులు చల్లా చిన్న ఆంజనేయులు, ఎ.సురేష్ బాబు ఆధ్వర్యంలో గుంటూరు నగర ఐరన్ విభాగం కమిటీ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి అజయ్‌కుమార్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు రావుల అంజిబాబు, ఐరన్ యూనియన్ నాయకులు పప్పుల రోశి రెడ్డి, శీను, శ్రీహరి, నాగేశ్వరరావు, శీను పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆధ్వర్యంలో చలివేంద్రం



నెహ్రూనగర్: గుంటూరు ఈస్ట్ 1 సెక్టార్ అంగన్‌వాడీ టీచర్స్ ఆధ్వర్యంలో ఏసీ కాలేజీ ఎదురుగా ఉన్న పునీత ఆగ్నేసమ్మ చర్చి వద్ద పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా తాగునీటి సదుపాయం కల్పించారు. ఎండ వేడిమికి ఇబ్బందులు కలగకుండా అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో చలివేంద్ర నిర్వహణ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్ఎస్ తబిత పాల్గొన్నారు.

విజయవాడలో నేడు నరేంద్ర మోదీ రోడ్ షో

గుంటూరు మెడికల్: విజయవాడలో ఎన్డీఏ అభ్యర్థుల విజయం కోసం బుధవారం రోడ్ షో నిర్వహించనున్నట్లు బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్‌షో పీవీఆర్ మాల్ నుంచి బెంజ్ సర్కిల్ వరకు సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుందన్నారు. రోడ్‌షోలో ప్రధాని నరేంద్ర మోదీతో పాటు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పాల్గొంటారని తెలిపారు.

నైపుణ్యాలతో ప్రతిభ నిరూపణ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు తమలోని నైపుణ్యాలను వెలికితీసినప్పుడే ప్రతిభను నిరూపించుకుని ఉద్యోగాలను సాధించగలరని వేద విజ్ఞాన అకడమిక్ రీసెర్చ్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ వి. జ్ఞానసాగర్ పేర్కొన్నారు. మంగళవారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసీ చివరి సంవత్సర విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యాలు, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ కె.రవికుమార్, ఓఎస్డీ పి. సీతారామయ్య, హ్యూమనిటీస్ విభాగాధిపతి డాక్టర్ కె.విజయభాస్కర్, సీహెచ్ ప్రసాదరావు పాల్గొన్నారు.

నగరంపాలెం ఎస్‌హెచ్‌ఓగా మధుసూదనరావు



గుంటూరు ఈస్ట్: నగరంపాలెం ఎస్‌హెచ్‌ఓగా ఎం.మధుసూదనరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. 2004లో ఎస్ఐగా విధుల్లో చేరారు. 2013లో సీఐగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం వీఆర్ నుంచి నగరంపాలెం ఎస్‌హెచ్‌ఓగా బదిలీపై వచ్చారు.

నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- 34వ డివిజన్‌లో మనతో మన రజినమ్మ ఎన్నికల ప్రచారం
- హాజరైన విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరిధర్



ప్రచారంలో పాల్గొన్న మంత్రి రజని, పక్కన విప్ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరిధర్

పట్నంబజారు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపిస్తే.. గుంటూరును అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని హామీ ఇచ్చారు. స్థానిక 34వ డివిజన్ పరిధిలోని కొబాల్ట్‌పేట, దేవాపురం, బ్రాడీపేట సెకండ్ క్రాస్ రోడ్డు, ఫాతిమాపురం తదితర ప్రాంతాల్లో మంగళవారం మనతో మన రజినమ్మ కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే ప్రతి జిల్లా కేంద్రాన్ని రోడ్లు, డ్రైనేజీ, ట్రాఫిక్ మేనేజిమెంట్, పార్కులు, ఇత సదుపాయాలతో స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతామని చెప్పారు. అందు కోసం తొలి విడతగా రూ.2 వేల కోట్లు కేటాయించేలా మేనిఫెస్టోలో ఇప్పటికే ప్రకటించామని వివరించారు. మధ్య తరగతి ప్రజల కోసం రూ.2 వేల కోట్ల కార్పస్ ఫండ్‌తో ఎంఐజీ లే-అవుట్లను పట్టణ ప్రాంతాల్లో దశల వారిగా నిర్మించి పంపిణీ చేస్తామని చెప్పారు. ఇల్లు లేని ప్రభుత్వ ఉద్యోగులకు వారి సొంత జిల్లాల్లోనే ఇళ్ల స్థలాలను 60 శాతం ఖర్చు తమ ప్రభుత్వమే భరిస్తూ పంపిణీ చేస్తుందని వెల్లడించారు.

చంద్రబాబు దుర్మార్గానికి ఒడిగడుతున్నారు

ఎన్నికల సాకును అడ్డుపెట్టుకుని చంద్రబాబు.. పేదలకు వారి ఖాతాల్లో సంక్షేమ పథకాల డబ్బు జమ కాకుండా అడ్డుకుంటున్నారని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మండిపడ్డారు. దుర్మార్గానికి ఒడిగట్టిన టీడీపీని ఎన్నికల్లో ప్రజలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు ఎంతమందితో కూటమి కట్టినా ఇంకా గెలుస్తామనే ధైర్యం చాలడం లేదన్నారు.

పశ్చిమలో వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, పార్టీ నగర అధ్యక్షుడు మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ గుంటూరు పశ్చిమలో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగిస్తుందని, మంత్రి విడదల రజిని గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. మే 13న ఎన్నికల్లో నిశ్శబ్ద విప్లవం జరగనుందని, జూన్4న వెల్లడయ్యే విస్ఫోటనంలో చంద్రబాబు అండ్ కో కొట్టుకుపోతారని అన్నారు. కార్యక్రమంలో 34వ డివిజన్ కార్పొరేటర్ బూసి రాజలత, మాజీ కార్పొరేటర్ దేవానంద్, వైఎస్సార్ సీపీ నాయకులు గిరి రాము, రాయప్ప, భాగ్యరావు, గోపి, సైదా, వెంకటరత్నం, మేరుగ విజయ, ఉషారాణి, కిరణ్, సందీప్, ప్రదీప్, బూన్, జంగాల రాజు, మేకల నగేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుంటూరు పశ్చిమలో 1,494 పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

నెహ్రూ నగర్: గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మంగళవారం 1,494 ఓట్లు పోస్టల్ బ్యాలెట్‌లను ఉద్యోగులు వినియోగించుకున్నారు. 5 తేదీ నుంచి 7వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా మొత్తం 2,095 ఓట్లు పోలయ్యాయని పశ్చిమ నియోజకవర్గ ఆర్‌ఓ కె.రాజ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కూటమి నేతలకు తగిన బుద్ధి చెప్పాలి

నెహ్రూ నగర్: పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టిన కూటమి నేతలు అడ్డుపడటం సిగ్గుచేటని, 13న జరగనున్న ఎన్నికల్లో కూటమి నేతలకు ఓటుతో తగిన బుద్ధి చెప్పి వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాలని మాదిగ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పుసులూరి జీవా మాదిగ పేర్కొన్నారు. మంగళవారం నగరంపాలెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా వైద్య రంగాల్లో సీఎం జగన్ తీసుకువచ్చిన విప్లవాత్మక నిర్ణయాలతో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. కూటమి నేతలు స్వార్థం కోసం ఎలాగైనా అధికారం దక్కించుకోవాలని ఉద్దేశంతో నీచ రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు.

సార్వత్రిక ఎన్నికల్లో నిజాయతీ పరులను ఎన్నుకోవాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, జనవిజ్ఞానవేదిక ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని నిజాయతీ పరులను ఎన్నుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. మంగళవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఎన్నికల మేనిఫెస్టోలో ఉండాల్సిన అంశాలపై కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించేవారిని, పర్యావరణాన్ని కాపాడే వారిని గెలిపించాలని కోరారు. ప్రజలకు ఉపాధి కల్పన, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి, మద్యం, మాదక ద్రవ్యాలను నిషేధించేవారినే గెలిపించాలన్నారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేవారిని ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.జాన్‌బాబు, బి.ప్రసాద్, జి.వెంకటరావు, బి.శంకర్‌సింగ్, ఎం.ఉదయ్‌భాస్కర్, బి.ప్రతాప్‌సింగ్, టీఆర్ రమేష్. బి.ఉదయ్‌భాస్కర్, షేక్ సుభానీ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

నెహ్రూ నగర్: ఎన్నికల్లో ఓపీఓ విధులు కేటాయించబడిన ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్‌ని 3వ రోజు 1,147 మంది ఉద్యోగులు సద్వినియోగం చేసుకున్నారని, అందుకు తగిన విధంగా అసౌకర్యం కల్గకుండా, హెల్ప్ డెస్క్‌లు, అదనపు కౌంటర్లు ఏర్పాటు చేశామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి తెలిపారు. మంగళవారం స్థానిక ఏసీ కాలేజ్‌లోని ఫెసిలిటేషన్ సెంటర్‌ని పరిశీలించి, పోస్టల్ బ్యాలెట్‌కి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కుని వినియోగించుకోవడానికి అనువుగా ఏసీ కాలేజ్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో తూర్పు నియోజకవర్గానికి 2, ఇతర నియోజకవర్గాలకు మరో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని తెలిపారు. తూర్పు నియోజకవర్గం ఓటింగ్‌కు 5 కౌంటర్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మంగళవారం ఓపీఓలు 1,147 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారన్నారు. 5,6,7 తేదీల్లో తూర్పు నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 1723 మంది ఓటు వినియోగించుకున్నారని పేర్కొన్నారు.

ఏఎన్‌యూ నేపాల్ వర్సిటీతో ఎంఓయూ



ఎంఓయూ పత్రాలను వీసీ ఆచార్య రాజశేఖర్‌కు అందజేస్తున్న ఉదయకుమార్, మధుబాబు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ బౌద్ధ అధ్యయన విభాగం నేపాల్‌లోని లుంబినీ బుద్ధిస్ట్ యూనివర్శిటీతో ఎంఓయూ(అవగాహన ఒప్పందం) కుదుర్చుకుంది. ఈనెల 4,5 తేదీలలో నేపాల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఏఎన్‌యూ బుద్ధిజం విభాగాధిపతి ఆచార్య ఎల్. ఉదయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లుంబినీ యూనివర్సిటీతో ఏఎన్‌యూకి ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఎంఓయూ పత్రాలను మంగళవారం ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్‌కు ఉదయకుమార్ అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రొఫెసర్ రాజశేఖర్ మాట్లాడుతూ రెండూ యూనివర్సిటీల మధ్య కుదిరిన ఈ ఒప్పందంతో రెండు దేశాల మధ్య సాహిత్య, సంస్కృతిక, మేధపరమైన అంశాలపై విస్తృత పరిశోధనలు జరగాలన్నారు. బుద్ధిజంపై విస్తృతంగా అధ్యయనం, పరిశోధనలు చేసే అవకాశం ఉంటుందని ఆచార్య ఉదయకుమార్ తెలిపారు. రెండు యూనివర్సిటీలు పరస్పర అవగాహనతో విద్యా, పరిశోధనలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, ఐక్యూఏసీ డైరెక్టర్ ఆచార్య సంధ్యాకోల్, సీడీఈ డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, ఐఎస్సీ డైరెక్టర్ ఆచార్య జి.చెన్నారెడ్డి పాల్గొన్నారు.

దినదినగండం 'తలసీమియా'

- నిత్యం రక్తం అవసరం.. ఆపితే ప్రాణాలకే అపాయం
- నేడు ప్రపంచ తలసీమియా డే
- వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం
- అవగాహనతో వ్యాధి బారిన పడకుండా ఉండొచ్చు
- బాధితులకు రూ.10వేలు సాయం అందజేస్తున్న ప్రభుత్వం



గుంటూరు మెడికల్: తలసీమియా వ్యాధి ప్రాణాంతకమైనది.. వ్యాధికి గురైన చిన్నారికి జీవితాంతం రక్తం ఎక్కిస్తూనే ఉండాలి. ఏ క్షణానైనా రక్తం ఎక్కించడం ఆపివేస్తే కొద్దిరోజుల్లోనే పిల్లవాడు చనిపోతాడు. వ్యాధిపై అవగాహన కలిగి ఉండటం ద్వారా పుట్టబోయే పిల్లలు వ్యాధి బారిన పడకుండా కాపాడవచ్చు. తలసీమియాపై అవగాహన కల్పించేందుకు మే 8న ప్రపంచ తలసీమియా డే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా' సాక్షి 'అందిస్తున్న ప్రత్యేక కథనం.

జిల్లాలో 110 మంది బాధితులు



తలసీమియాతో ప్రతి ఏడాది వేలాదిమంది పిల్లలు జన్మిస్తున్నట్లు వైద్య గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గుంటూరు జిల్లాలో ప్రతినెలా ఏడుగురు చిన్నారులు తలసీమియా వ్యాధి సోకి చికిత్స కోసం జీజీహెచ్‌కు వస్తున్నట్లు పిల్లల వైద్య నిపుణులు తెలిపారు. ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్‌లో 70 మంది చిన్నారులు చికిత్స పొందుతున్నారు. చిన్నపిల్లల వైద్య విభాగంలో ప్రతిరోజూ బాధితులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. బాధితులకు క్రమం తప్పకుండా రక్తం కూడా ఉచితంగా ఎక్కిస్తున్నారు. ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా తలసీమియా బాధితులకు పిల్లల వైద్య విభాగంలో ఓపీ వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రతినెలా సుమారు రూ. 5వేలు ఖరీదు చేసే మందులు సైతం ఉచితంగా అందిస్తున్నారు.

వ్యాధి రావడానికి కారణాలు..



తలసీమియా వ్యాధి జన్యుపరమైనది. ఎముక మూలుగలో హిమోగ్లోబిన్ ఉండే రక్తకణాల ఉత్పత్తి నిలిచిపోవటాన్ని తలసీమియా వ్యాధి అంటారు. ఇది తల్లిదండ్రుల ద్వారా పిల్లలకు సోకుతుంది. తలసీమియా సోకిన వారికి జీవితాంతం రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. మనం పీల్చే ప్రాణవాయువు(ఆక్సిజన్)ను రక్తం ద్వారా శరీరంలోని అన్ని భాగాలకు అందించేది హిమోగ్లోబినే. తలసీమియా రోగుల్లో శరీరానికి సరిపడా హిమోగ్లోబిన్ ఉత్పత్తి కాదు. ఒక వేళ తయారైన ఎక్కువ కాలం హిమోగ్లోబిన్ ఉండదు. హిమోగ్లోబిన్ నిల్వలు తగ్గిన ప్రతిసారి కృత్రిమంగా రక్తం ద్వారా హిమోగ్లోబిన్‌ను అందించాలి. సకాలంలో అందించకపోతే ప్రాణాలు పోతాయి.

వ్యాధి లక్షణాలు..



పుట్టిన బిడ్డ మూడు నెలల వయస్సు నుండి 18 నెలల వయస్సులోపే ఈ వ్యాధి బయట పడుతుంది. ముఖం పీక్కుపోవటం, బాల్యంలోనే ముడతలు పడినట్టుగా తయారవుతుంది. శరీర రంగుతేడాగా ఉండి పాలిపోయినట్టుగా మారుతుంది. శారీరక ఎదుగుదల ఉండదు. బొడ్డు భాగంలో వాపు ఉంటుంది. తరచుగా అనారోగ్యానికి గురవుతారు. బాధితుల్లో అడుగేస్తే ఆయాసం, తీవ్రస్థాయిలో నీరసం, జీర్ణశక్తి మందగించడం, పొట్ట లావు ఎక్కడం, ఎముకల్లో పటుత్వం తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఐరన్ తక్కువగా ఉండాలి. కాని శరీరంలోకి రక్తం ఎక్కించే సమయంలో ప్రవేశించే ఐరన్ ఓకేచోట కుప్పలాగా పోగుబడి మూత్ర పిండాలు, కాలేయం , గుండె సమస్యలు తలెత్తుతాయి.

బాధితులకు రూ.10వేలు ఆర్థిక సాయం

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి తలసీమియా వ్యాధిని ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చారు. ఆయన తనయుడు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తలసీమియా బాధితుల సమస్యలను నివారించేందుకు వారికి కొండంత అండగా నిలబడ్డారు. ప్రతినెలా బాధితులకు రూ.10వేలు ఆర్థిక సాయం పెన్షన్ రూపంలో అందిస్తున్నారు. బాధితులకు అవసరమయ్యే వైద్య సేవలన్నీ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది.

డైక్ సెంటర్‌లో ఉచితంగా వైద్య సేవలు



గుంటూరు జీజీహెచ్ ఆవరణలోని జిల్లా సత్వర చికిత్సా కేంద్రం (డైక్)లో తలసీమియా బాధితులకు ఉచితంగా వైద్య సేవలు అందించడంతోపాటు మందులు కూడా అందిస్తున్నాం. జిల్లావ్యాప్తంగా 110 మంది తలసీమియా బాధితులు ఉన్నారు. గర్భిణులకు స్క్రీనింగ్ పరీక్షలు చేయడం ద్వారా తలసీమియాను కట్టడి చేయవచ్చు.

– డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డైక్ సెంటర్ ఇన్‌చార్జి, గుంటూరు

ముందస్తుగా గుర్తించవచ్చు..



తలసీమియా వ్యాధిని పసిగుడ్డు గర్భంలో ఉన్న సమయంలో వ్యాధి నిర్ధారణ చేసి గుర్తించవచ్చు. పెళ్లికి ముందే వధూవరులకు కంప్లీట్ బ్లడ్ కౌంట్ సీబీసీ, హెచ్‌బీఏ 2 లెవల్ పరీక్షలు చేయించాలి. తలసీమియా వ్యాధి కుటుంబాలకు జన్యుపరమైన పరీక్షలు చేయాలి. వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడం ద్వారా వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకునే అవకాశం కలుగుతుంది.

– డాక్టర్ షేక్ షమా సుల్తానా, సీనియర్ గైనకాలజిస్ట్, గుంటూరు





చల్లని కబురు

గ్రీష్మంలో ఎండ, ఉక్కపోతతో ఇబ్బందు పడిన ప్రజలకు ఉపశమనం లభించింది. మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. సాయంత్రం 4.30 గంటల నుంచి వాతావరణం చల్లగా మారి ఈదురుగాలులతో వర్షం కురిసింది. -సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

వ్యాధి నిర్ధారణ ఫలితాలు సత్వరమే అందించాలి

డాక్టర్ కిరణ్‌కుమార్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిపై నమ్మకంతో వస్తున్నా రోగులకు వ్యాధి నిర్ధారణ పరీక్షల ఫలితాలను సత్వరమే అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. మైక్రో బయాలజీ, బయోకెమిస్ట్రీ, పెథాలజీ వైద్య విభాగాధిపతులతో లేబొరేటరి పరీక్షలు వాటి ఆవశ్యకతపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి రోజుకు నాలుగు వేల నుంచి ఐదు వేల మంది వరకు రోగులు వస్తున్నారని వివరించారు. అందులో రెండు వేల మంది రోగులు ఇన్ పేషంట్‌గా ఉంటున్నారని పేర్కొన్నారు. ఆస్పత్రిలో గుండె ఆపరేషన్లు, కిడ్నీ, కాలేయం వంటి ఆపరేషన్లు జరుగుతున్నాయని ఈ పరిస్థితులలో ల్యాబ్ పరీక్షలు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్ష ఫలితాలు నిక్కచిగా అందించాలన్నారు. ఆస్పత్రిలో రోగులు 30 నుంచి 40 మందికి పైగా వెంటిలేటర్‌పై ఉంటున్నారని తెలిపారు. ఆసుపత్రిలో అన్ని రకాల పరీక్షలు జరగాలని ఆదేశించారు. ఆస్పత్రి నుంచి రక్త నమూనాలు బయటకు వెళుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని దానికి తోడు ఆస్పత్రిపై దుష్ప్రచారం చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. ఆసుపత్రికి, మెడికల్ కళాశాలకు చెడ్డ పేరు తీసుకుని రావద్దని కోరారు. అందుబాటులో ఉన్న రక్త వ్యాధి నిర్ధారణ పరీక్షలు సత్వరమే చేసి రోగి కోలుకునే విధంగా సహకరించాలన్నారు.

పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ తో విద్యార్థులకు ప్రయోజనం



మాట్లాడుతున్న హెచ్‌ఆర్ ఫుట్ ప్రింట్స్ సీఈవో రాజ్‌కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా విద్యార్థులకు వ్యాపార నైపుణ్యాలతో పాటు వ్యవస్థాపకులుగా ఎదిగే క్రమంలో ప్రయోజనాలు ఉంటాయని హెచ్‌ఆర్ ఫుట్ ప్రింట్స్ సీఈఓ డాక్టర్ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో మంగళవారం ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ ద్వారా సంస్థలను అనుసంధానించడం అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. రీసోర్స్ పర్సన్‌గా పాల్గొన్న రాజ్‌కుమార్ మాట్లాడుతూ తాము అకడమిక్‌గా అధ్యయనం చేసిన అంశాలను వాస్తవ పరిస్థితులతో అన్వయించేలా క్షేత్రస్థాయిలో శిక్షణ పొందడమే ఇంటర్న్‌షిప్ అని అన్నారు. తద్వారా విద్యార్థులకు పరిశ్రమల్లోని క్షేత్ర పరిస్థితులపై అవగాహన పొందడమే కాకుండా నైపుణ్యాలు చేకూరుతాయన్నారు. వీటితో పాటు అంతర్గత నైపుణ్యాలు, టీం వర్క్, పనిలో నైపుణ్యం, నిర్ణయాధికారం, సమస్యను పరిష్కరించే నైపుణ్యాలు దక్కుతాయన్నారు. ఇంటర్న్ ట్రైనీగా చూపే ప్రతిభ, పనితీరు సంస్థ యాజమాన్యం మెచ్చే విధంగా ఉంటే పూర్తి స్థాయిలో ఉద్యోగం లభిస్తుందన్నారు. అనంతరం ఇంటర్న్‌షిప్, ప్రాంతీయభాష, బృందంతో కలసి పని చేసే సమయంలో పైస్థాయి అధికారులతో నడుచుకునే విధానాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ పరిశ్రమలు తమ కళాశాల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, అసోసియేట్ ప్రొఫెసర్లు డి. కళ్యాణి, ఎస్. గోపి శ్రీనివాసరావు, సీహెచ్ వైష్ణవి, ఏ. బాజీబాబు, వి. అభిలాష్, ఎన్. మణికంఠ, బి.అనిత పాల్గొన్నారు.

నైపుణ్యాలతో ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలి



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో రామకృష్ణ ప్రభు, రాఘవరావు, శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యతో పాటు నైపుణ్యాల ద్వారా ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలని గుంటూరు చలమయ్య- కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కర్పూరపు రామకృష్ణ ప్రభు పేర్కొన్నారు. సంగడిగుంటలోని చలమయ్య కళాశాలలో మంగళవారం వివిధ సంస్థల్లో ఉద్యోగాలు సాధించిన 40 మంది విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ విద్యార్థులు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక కావడం గొప్ప విషయమని, జాతీయ స్థాయిలో ఉన్న పెద్ద కంపెనీల్లో ఉద్యోగాలను పొందడం విద్యార్థుల అదృష్టమని అన్నారు. కళాశాల అధ్యక్షుడు పచ్చిపులుసు రాఘవరావు మాట్లాడుతూ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు తమకు అప్పగించిన విధులను సక్రమంగా నిర్వహించి, చదువుకున్న కళాశాలకు మంచి పేరు తేవాలని అన్నారు. సంయుక్త కార్యదర్శి మాజేటి ప్రసాద్ మాట్లాడుతూ చదువుకున్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వం పై ఆధారపడక ప్రైవేటు రంగంలో సైతం సమర్థత కలిగిన సంస్థల్లో చేరి జీవితంలో స్థిరపడాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, కోశాధికారి జయప్రకాష్, కర్పూరపు సూర్యనారాయణ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఏ శ్రీధర్, ప్లేస్మెంట్ అధికారి చంద్రశేఖర్, అధ్యాపకులు లక్ష్మీ శుభద్ర, అరుణ కుమారి, భవానీ దుర్గ, ఇందిరా, మల్లేశ్వరి, రాజరాజేశ్వరి పాల్గొన్నారు .

ఎస్‌కేబీఎం పాఠశాల తనిఖీ

నగరంపాలెం: గుంటూరు పశ్చిమ సబ్ డివిజన్ నగరంపాలెం పీఎస్ పరిధిలోని ఏటీ అగ్రహారం 10 వీధిలో ఉన్న ఎస్‌కేబీఎం ఉన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్‌ను మంగళవారం జిల్లా ఎస్పీ తుషార్ దూడీ సందర్శించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఈనెల 13న బూత్‌లో ఓట్లు వేసేందుకు ఏయే ప్రాంతాల నుంచి ఎంత మంది వస్తారని ఆరా తీశారు. బారికేడ్ల ఏర్పాటు, ఓటర్ల రాకపోకలు, వాహనాల నిలుపుదల, ట్రాఫిక్ ఇతరత్రా అంశాలపై కూలకుషంగా పరిశీలించారు. వేసవి దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టాల్సిన జాగ్రత్తలు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వ శాఖల అధికారుల భాగస్వామ్యంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ వెంట శిక్షణ ఐపీఎస్ అధికారి మనోజ్ హెగ్డే, నగరంపాలెం సీఐ మధుసూదనరావు ఉన్నారు.